క్లుప్తంగా

బాలల హక్కులు, పథకాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలల హక్కులు, వారికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై స్థానిక తంగెళ్లమూడి జేఎంజే పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్‌హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వైవీ రాజు మాట్లాడుతూ ఎవరైనా బాలలు ఆపదలో ఉంటే వెంటనే బాలల సహాయవాణి 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ సీహెచ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నిరోధానికి చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాజశేఖర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో నేరాలను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. ఏలూరు వన్‌టౌన్‌లోని బులియన్ మర్చంట్స్ వ్యాపారులు, వర్తక సంఘం యజమానులతో శ్రీ సీతారామ భర్తియా కల్యాణ మండపంలో గురువారం రాత్రి ఆయన సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఏలూరులోని బులియన్ షాపుల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చోరీలను అరికట్టేందుకు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ వినియోగించుకోవాలని సూచించారు. బంగారం నాణ్యత, వస్తువుల తయారీలో వినియోగించే యాసిడ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, అనుమానితులు, ఇతరులకు యాసిడ్ విక్రయించటం నేరమని హెచ్చరించారు. ఇతరుల నుంచి బంగారు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వారి వివరాలు సేకరించాలన్నారు. నేరాలను నిరోధించేందుకు సహకరించాలని డీఎస్పీ కోరారు. సమావేశంలో ఎస్సైలు ఎస్.రామకృష్ణ, మదీనా బాషా, లక్ష్మణబాబు, సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థతో పారదర్శక పాలన



ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుట్రలకు టీడీపీ నేత చంద్రబాబు, జనసేన నేత పవన్ కళ్యాణ్ తెరతీశారు. ఈ నేపథ్యంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తామంతా వలంటీర్లకు అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. వలంటీర్ల సేవలపై ప్రజలు సైతం పూర్తిస్థాయిలో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరులో వలంటీర్లకు అండగా ఉంటామంటూ హామీ ఇస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని (ఫైల్)

నాడు

'హోంగార్డ్స్ వలంటరీ ఫోర్స్ అనేది డిసెంబర్ 1946లో దేశంలో చిన్నగా ప్రారంభమైంది. చైనాతో యుద్ధ సమయంలో మేధావులు, డాక్టర్స్, ఇంజినీర్స్ ఇతర యువత వలంటీర్ (స్వచ్ఛందం)గా ప్రజలకు ఉచితంగా సేవలు అందించారు. 1962లో హోమ్‌గార్డులకు చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం ఈ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. కాలానుగుణంగా మార్పులు సంతరించుకుంటూ పోలీస్ శాఖకు అనుసంధానంగా నేడు సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు కీలకంగా మారాయి'

నేడు

'అవినీతి, దోపిడీ, వేధింపులు లేని స్వచ్ఛమైన పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను రూపుదిద్దారు. సేవ చేయాలనే తపన, చదువుకున్న యువత, మహిళలతో వలంటీర్ వ్యవస్థ ఏర్పడింది. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ లాభాపేక్ష లేని స్వచ్ఛంద సేవకులే వలంటీర్లు. వారికి గౌరవవేతనం ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భవిష్యత్తులో హోంగార్డుల తరహాలోనే దేశవ్యాప్తంగా ప్రజలకు సేవలందించే గొప్ప వ్యవస్థగా మారుతుందనే అభిప్రాయమూ ఉంది.'

సీఎం జగన్ వెంటే జనం



ప్రజలకు మేలు చేయాలనే తపనతో సీఎం వైఎస్ జగన్ శ్రమిస్తున్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు అందిస్తూ పేద కుటుంబాలను ఆదుకున్నారు. మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ప్రభుత్వమే మాకు ఇల్లు కట్టించే పనిలో నిమగ్నమైంది. మాకు అమ్మఒడి, చేదోడు, డ్వాక్రా రుణమాఫీ వస్తోంది. మా అత్తగారికి చేయూత, డ్వాక్రా రుణమాఫీ వచ్చింది. మా మావగారికి నెలానెలా పింఛన్ ఒకటో తేదీనే ఇస్తున్నారు. అన్ని రకాల సేవలు మా వలంటీర్ జి.శారద చక్కగా అందిస్తోంది. జగనన్న వెంటే జనమంతా ఉంటారు.

– దెక్కత యువలక్ష్మి, ఏఏఎస్ కాలనీ, ఏలూరు

దోపిడీదారులు లేరు



సీఎం జగన్ పాలన చాలా బాగుంది. దళారులు, రాజకీయ నాయకుల దగ్గరకు వెళ్లి పదేపదే అడిగితే తప్ప పథకాలు వచ్చేవి కాదు. నేడు వలంటీర్లే మా వద్దకు వచ్చి పథకాలకు దరఖాస్తు చేసి మంజూరయ్యేలా చూస్తున్నారు. మా వలంటీర్ యామిని ఎంతో చక్కగా మాతో కలిసిపోతూ సేవలు చేస్తోంది. నాకు వైఎస్సార్ చేయూత పథకం వస్తోంది.

– దుగ్గిరాల దేవి, వైఎస్సార్ కాలనీ, ఏలూరు

వలంటీర్ సేవలు భేష్



మాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయి. మా వలంటీర్ పవన్ మాకు ప్రభుత్వ పరంగా రావాల్సిన ప్రతి పథకాన్నీ అందేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. నాకు ఇల్లు మంజూరైంది. ప్రభుత్వమే కట్టిస్తోంది. సున్నా వడ్డీకే డ్వాక్రా రుణం మంజూరు చేశారు. మా అత్తగారికి చేయూత, డ్వాక్రా రుణమాఫీ, వితంతు పెన్షన్‌కు కూడా ప్రభుత్వం అందిస్తోంది. సచివాలయం సిబ్బంది, వలంటీర్ల పనితీరు సంతృప్తిగా ఉంది. ప్రజలు వలంటీర్ల సేవలపై సంతోషంగా ఉన్నారు.

– ఆదారి లక్ష్మి, గాంధీకాలనీ, ఏలూరు

సొంతింటి కల నెరవేరుతుంది



ఒకప్పుడు ప్రభుత్వం ఏమి చేస్తుందో కూడా జనాలకు తెలిసేది కాదు. ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగితే గానీ ఏదీ వచ్చేది కాదు. నేడు సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో మా ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పథకాలకు దరఖాస్తు చేయిస్తున్నారు. నాకు ఇంటి స్థలం వచ్చింది. త్వరలోనే ఇల్లు కట్టిస్తారనే నమ్మకం ఉంది. మాకు సొంతిల్లు ఉండాలనే కల నెరవేరనుంది. మా వలంటీర్ యామిని మాకు ప్రభుత్వ పరంగా ఏది కావాలన్నా వెంటనే చేస్తోంది. ఇలాంటి పాలన దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు.

– బోను వరాలమ్మ, 13వ డివిజన్, ఏలూరు



తల్లి ప్రేమ..





గొడుగు సాయంతో

తెరిపివ్వని వాన

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణితో ఏలూరు నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రజలు అత్యవసరమైతే గొడుగులు, చున్నీల సాయంతో బయటకు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసినవర్షంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



దెందులూరు జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం



చున్నీ ముసుగుతో..

పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక సేవలు

ఏలూరు(మెట్రో): జిల్లా వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలు అందిస్తున్నట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా ఛీఫ్ మేనేజర్ బి.విల్సన్ పాల్ తెలిపారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా జిల్లా కార్యాలయంలో 116వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఖాతాదారుల సేవలు అందించేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఖాతాదారులకు సేవలు అందించడంలో తమ బ్యాంకు ముందువరుసలో ఉందని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి వారి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరితగతిన ప్రోసెసింగ్, ఫార్వడ్ చేస్తూ ఖాతాదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం ప్రేమాలయం వృద్ధాశ్రమంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సంతోష్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ టి.శశిధర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రామచంద్రరావు పేట, రమా మహల్ సెంటర్, సుబ్బమ్మదేవి స్కూల్ సెంటర్, అశోక్ నగర్, కొత్తపేట, చేపలతూము సెంటర్, పవర్‌పేట స్టేషన్ రోడ్డు, చాణక్యపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	44
పచ్చిమిర్చి	76-84	బీట్‌రూట్	44
కాకర కాయలు	34	కీరా దోస	36
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	48	అల్లం	188-270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	42	పాలకూర	12
దొండకాయలు	18	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	20-30	బఠాణి	--
అనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	108
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	25

పేదల సంక్షేమం సీఎం జగన్ ధ్యేయం

ఏలూరు రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం ఏలూరు మండలం శ్రీపర్రు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 99 శాతం పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు ఇచ్చిన మాట కోసం నాలుగేళ్ల పాటు పథకాలను కొనసాగించారని కొనియాడారు. సంక్షేమంతో పాటు ప్రతి గ్రామంలో సుమారు రూ.1 కోటితో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ క్లినిక్ భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకు పాలన తీసుకొచ్చారని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వ సేవలు వేగవంతం చేశారని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, మల్టీపర్పస్ కమ్యునిటీహాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మీ అధ్యక్షతన తహసీల్దార్ బి.సోమశేఖర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్జీదారులకు జెడ్పీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా ధ్రువ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ మండల సరస్వతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు తేరా ఆనంద్, సైదు వజ్రం తదితరులు పాల్గొన్నారు.



శ్రీపర్రులో అర్జీదారులకు ధ్రువపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

22న హేలాపురిలో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఈ నెల 22న హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల వైస్ ప్రెసిడెంట్, అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అరసవిల్లి ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హేలాపురి కళాశాల ఆవరణలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. విప్రో, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కాప్స్ స్టోన్ ఫెసిలిటీస్ మేనేజ్మెంట్ లిమిటెడ్,ఆదాన్ సొల్యూషన్, ఫ్లోటెక్, కేపీవై ఫైనాన్షియల్ సొల్యూషన్స్, టీంగోల్, సెక్యూర్ స్మార్ట్ సొల్యూషన్స్, ఏఎంఎస్‌వైఎస్, టెక్ మహీంద్రా, టాలెంట్ ప్రో ఫౌండేషన్, టెలి పెర్ఫార్మెన్స్, ఐఎన్ఎస్‌వోవీ యువర్ పీపుల్ స్టార్టప్స్ వంటి పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు రానున్నటట్టు తెలిపారు. ఈ మేళాలో మూడు వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్టు చెప్పారు. ఏలూరు, పరిసర ప్రాంత యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్లు 99899 14587, 94592 56666లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఎస్‌కేఎం జిల్లా సదస్సు

ఏలూరు (టూటౌన్): రైతాంగ సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) జిల్లా సదస్సు ఈ నెల 21న ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు నాయకులు కె.శ్రీనివాస్, ధర్మల సురేష్, బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, పి.శ్రీనివాస్, ఎస్‌కే గౌస్, ఎస్‌కే బాషా గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతులు, కార్మికులు సదస్సులో పాల్గొనాలని కోరారు.

పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ హెచ్చరించారు. గురువారం నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల, ఈదర సుబ్బమ్మ దేవి పాఠశాలల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీ నగర్ మున్సిపల్ పాఠశాలలో కొందరు విద్యార్థులు స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫారం లేకుండా రావడాన్ని గుర్తించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈదర సుబ్బమ్మ దేవి పాఠశాలలో డ్రాపౌట్లు ఎక్కువగా ఉండడంతో బడి మానేసిన వారిని తిరిగి చేర్పించేందుకు తగిన సూచనలిచ్చారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం కాకుండా అన్నం, సాంబారు విడివిడిగా వండి వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆదేశించారు. పాఠశాల పరిస్థితిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో సమగ్రశిక్ష సీఎంఓ జె.రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజన సరఫరాను పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్

సర్వేశ్వరరావు ఆశయాలు ఆదర్శనీయం

ఏలూరు (టూటౌన్): ఏలూరు పట్టణ అభివృద్ధికి, కార్మిక సంఘాల నిర్మాణానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే సీపీఐ నాయకులు అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను కార్మికసంఘాలు ఆదర్శంగా తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక వైఎంహెచ్ఏ సెంటర్లో ఏఐటీయూసీ అనుబంధ ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం ఆధ్వర్యంలో సర్వేశ్వరరావు 41వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సర్వేశ్వరరావు కౌన్సిలర్‌గా పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. పొగాకు పనివారల సంఘం గౌరవ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే మాట్లాడుతూ సర్వేశ్వరరావు, వీరమాచనేని విమలాదేవిలు ఏలూరు జూట్‌మిల్లు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి, తమ్మిలేరుకు రివిట్ మెంట్ నిర్మాణానికి సర్వేవ్వరరావు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. పొగాకు పనివారల సంఘం అధ్యక్షుడు జోగి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, పొగాకు పనివారల సంఘం నాయకులు గోళ్ల నాగేశ్వరరావు, పుప్పాల శ్రీనివాసు, చింతపల్లి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల గుర్తింపు కార్యక్రమం

ఏలూరు రూరల్: ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓటర్ల గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏలూరు నియోజకవర్గం ఎలక్టోరల్ అధికారి, జెడ్పీ సీఈఓ టి.రవికుమార్ అన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఏలూరు సీఈఓ అధ్యక్షతన మునిసిపల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఎస్ఆర్ 2024లో భాగంగా బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. బీఎల్ఓ ఇంటింటికీ తిరిగి ఓటరు వివరాలు సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. రాజకీయ నాయకులు, ఓటర్లు బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, ఏలూరు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ సాగర్, పలు పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్